# పాలిటీ & గవర్నెన్స్

## అవినీతి నిరోధక సవరణ బిల్లుకు లోక్‌సభలోనూ ఆమోదం

అవినీతి నిరోధక చట్టానికి పలు సవరణలు చేస్తూ తీసుకొచ్చిన బిల్లును పార్లమెంటు ఆమోదించింది.

- లంచం ఇచ్చేవారినీ శిక్షించేలా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే అరెస్టు చేయకుండా ఇందులో పలు నిబంధనలను చేర్చారు. 43 సవరణలతో రాజ్యసభ ఆమోదించిన ఈ బిల్లు– లోక్‌సభలోనూ ఆమోదం పొందింది.
- 'అవినీతిని నిరోధించే విషయంలో ప్రభుత్వ బాధ్యతను, పారదర్శకతను పెంపొందించడం చట్ట నిబంధనలను కఠినతరం చేయడం ఈ బిల్లు లక్ష్యం.
- సంయుక్త కార్యదర్శి, ఆ పైస్థాయి వారే కాకుండా అన్ని స్థాయిల అధికారులకూ అరెస్టుల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. విచారణను వేగవంతం చేయడం, విశ్రాంతి పొందిన తర్వాత కూడా నిజాయితీపరులైన అధికారులకు రక్షణ కల్పించడం వంటి నిబంధనలను ఈ బిల్లులో పొందుపరిచాం.
- లంచం పుచ్చుకున్నవారికి కనిష్ఠంగా మూడేళ్లు, గరిష్ఠంగా ఏడేళ్ల కారాగారశిక్ష, జరిమానా విధించాలని ఈ బిల్లు చెబుతోంది'
- పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు జరిగే ఎన్నికల్లో అవినీతి పాతుకుపోయిందనీ, దీన్ని పెకిలించే సంస్కరణలను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని కాంగ్రెస్ సభ్యుడు కె.హెచ్.మునియప్ప అన్నారు.
- లంచం తీసుకున్న వారితోపాటు లంచం ఇచ్చిన వారు కూడా ఇకపై నేరస్తులే. ఇందుకు గాను వారికి ఏడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది.
- 'ఉద్దేశపూర్వకంగా చేసే ఫిర్యాదుల నుంచి ఉన్నతాధికారులకు, వారు రిటైరైన తర్వాత కూడా రక్షణ కల్పించటం తోపాటు అవినీతి కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ఇందులో పలు నిబంధనలను చేర్చాం'
- తాజా సవరణ ద్వారా లంచం ఇవ్వజూపిన వారికి కనీసం మూడేళ్ల నుంచి గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. బలవంతంగా ఎవరైనా లంచం ఇవ్వజూపితే సదరు అధికారి ఆ విషయాన్ని పై అధికారులకు వారంలోగా తెలియజేయాలి.
- అధికారికి లంచం లేదా ఇతరత్రా లబ్ధి చేకూ రుస్తామంటూ హామీ ఇచ్చే ప్రైవేట్ సంస్థలకు జరిమానా విధించేందుకు వీలుంటుంది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎటువంటి కేసులకు సంబంధించి కూడా ప్రభుత్వ అధికారులపై పోలీసులు విచారణ చేపట్టరాదు'

## ఆర్థిక నేరగాళ్ల బిల్లు ఆమోదం

పరారైన ఆర్థిక నేరగాళ్ల బిల్లు-2013'ను లోక్‌సభ ఆమోదించింది. 'దీంతో నేరాలకు పాల్పడే సంస్థలు, వ్యక్తుల లేదా బినామీ దారుల ఆస్తులను జప్తు చేసుకునే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుంది. పరారైన వారి నుంచి డబ్బు రాబట్టుకునేందుకు బ్యాంకులకు ప్రభుత్వం సాయపడుతుంది' అని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ చెప్పారు.

## భూ సేకరణ బిల్లుకు ఎగువసభ ఆమోదం

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన తొలిరోజుననే రాజ్యసభలో భూసేకరణ చట్టం బిల్లు ఆమోదం పొందింది.

- తొలి రోజుననే రాజ్యసభ రెండు బిల్లులను ఆమోదించింది. స్థిరాస్థి కొనుగోలు, సేకరణ సవరణ బిల్లు 2017, ప్రభుత్వ బ్యాంకుల సవరణ, పునరేకీకరణ బిల్లు 2017, బాలికా విద్యా హక్కు నిర్బంధ విద్యాహక్కుకు రెండో సవరణ బిల్లు 2017 వంటి వాటిని ఆమోదించింది.
- భూసేకరణలో తీసుకున్న భూమికి మార్కెట్ ధరకంటే రెట్టింపుధరను చెల్లిస్తారని మంత్రి హామీ ఇచ్చారు.
- నిరుపేదల, రైతులకు చెందిన భూములే అధికంగా ఉన్నాయని, వారికి ఆ భూమి జీవనాధారమని అన్నారు.

## మూకదాడుల నియంత్రణకు చట్టం

మూకదాడులు చేసి చంపేస్తున్న సంఘటనల నియంత్రణకు అవసరమయితే ప్రభుత్వం చట్టాన్ని తీసుకొస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. మూకహింస అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తుందని వెల్లడించారు.

- మరోవైపు మూకదాడుల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు జారీ చేసింది.
- ఇటువంటి సంఘటనల నియంత్రణకు ప్రతి జిల్లాకు ఎస్పీ స్థాయి అధికారిని నియమించాలని, నియంత్రణ మార్గదర్శకాలను ఉల్లంఘించే పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటించాలంది.

**మూక హత్యలకు కళ్లెం వేయడానికి.. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ బృందంకేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన మరో ఉన్నతస్థాయి ప్యానెల్**

- దేశ వ్యాప్తంగా పలు చోట్ల జరిగిన మూక హత్యలు కలకలం రేపుతోన్న విషయం తెలిసిందే. సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి అవుతోన్న వదంతులను నమ్మి కొన్ని ప్రాంతాల్లో అమాయకుల ప్రాణాలను తీస్తున్నారు.
- ఈ ఘటనలను అరికట్టడానికి కేంద్ర హోంశాఖమంత్రి రాజ్‌నాథ్

సింగ్ అధ్యక్షతన కేంద్ర మంత్రులు సుష్మా స్వరాజ్, రవిశంకర్ ప్రసాద్, తవార్ చంద్ గెహ్లాట్‌తో మంత్రివర్గ బృందం ఏర్పాటయింది.

- ❖ అలాగే, కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా అధ్యక్షతన నలుగురు అధికారులతో మరో ఉన్నతస్థాయి బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మూక హత్యలకు కళ్లెం వేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ బృందం.. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ప్యానెల్‌కు నాలుగు వారాల్లో ప్రతిపాదనలు అందిస్తుంది.

**మూకహత్యల కట్టడే లక్ష్యంగా ఐపీసీలో మార్పులు**

అమాయకులపై మూకుమ్మడి దాడులను అడ్డుకునేందుకు భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సంబంధిత సెక్షన్లను సవరించాలని కేంద్రం భావిస్తోంది.

- ❖ మూక హత్యలను శిక్షార్హమైన నేరంగా నిర్వచించాలనీ ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు రాష్ట్రాలు అమలుచేసేందుకు వీలుగా ఓ మార్గదర్శక చట్టాన్ని రూపొందించే అంశాన్నీ పరిశీలిస్తోంది.
- ❖ ఒకవేళ ఐపీసీలోని సెక్షన్లను సవరిస్తే.. ప్రత్యేకంగా కొత్త చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉండదు. దాడి చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే ఉండేలా మార్పులుచేస్తే.. సీఆర్‌పీసీతోపాటు భారత సాక్ష్యాధారాల చట్టాన్నీ సవరించాల్సి ఉంటుంది.

## సీజేఐ కోర్టు నుంచే లైవ్ స్ట్రీమింగ్

కోర్టుల్లో జరిగే వ్యవహారాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా బయటి ప్రపంచానికి తెలియజేయాలనే ప్రతిపాదనకు కేంద్రం మద్దతు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు నివేదించింది.

- ❖ ఈ లైవ్ స్ట్రీమింగ్ ప్రక్రియ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోర్టు నుంచే ప్రారంభం కావాలని పేర్కొంది. ప్రత్యక్ష ప్రసారం ఆలోచనకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా ఉందని.. అయితే ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు.

**నేపథ్యం**

- ❖ న్యాయస్థానంలో జరిగే కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయవచ్చని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.
- ❖ కోర్టులో జరిగే వ్యవహారాలను చూసేందుకు శిక్షణ పొందే విద్యార్థులకు అనుమతించాలని కోరుతూ జోధ్‌పూర్‌లోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన స్వప్నిల్ త్రిపాఠీ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇచ్చిన కేంద్రం పైవిషయాన్ని తెలిపింది.
- ❖ కోర్టులో జరిగే కార్యకలాపాలను న్యాయస్థానం ఆవరణలో ప్రత్యక్ష ప్రసారం చేయాలని, ఇందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు.
- ❖ ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, న్యాయ మూర్తులు జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం చేపట్టింది.
- ❖ ఇందుకు సంబంధించి అటార్నీ జనరల్‌కు సూచనలు పంపించాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు సూచించింది.

## అన్ని కేసుల్లోనూ బాల నేరగాళ్లకు మరణ శిక్ష వేయలేం

అన్ని అత్యాచారాలు, హత్య కేసుల్లో బాల నేరగాళ్లకు మరణ శిక్ష విధించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్ వ్యాఖ్యానించారు.

- ❖ సాక్ష్యాలకు అనుగుణంగా శిక్ష ఉంటుందే తప్ప, క్రూరమైన నేరాలని చెప్పి అన్ని అత్యాచారాలు, హత్య కేసులకూ మరణశిక్ష వేయాలని చెప్పలేమని అన్నారు. సుప్రీంకోర్టులో బాలల న్యాయం కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన పశ్చిమ ప్రాంతంలో బాలల న్యాయం అమలుతీరుపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. పిల్లలపై జరుగుతున్న కేసులను విచారిస్తున్న న్యాయస్థానాలు సక్రమంగా పనిచేయడం లేదని అన్నారు.

## 16 ఏళ్ల బాలుడికి బెయిల్ నిరాకరించిన 'సుప్రీం'

ఏడేళ్ల బాలికను పాఠశాలలో గొంతు కోసి హత్యచేసిన 16ఏళ్ల బాలుడికి బెయిల్ మంజూరు చేయడానికి అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. బాలుడు చేసింది నీచమైన నేరమని పేర్కొంది.

- ❖ జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ ఇందు మల్హోత్రలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.
- ❖ గురుగ్రామ్‌లోని ఓ పాఠశాలలో పరీక్షలు వాయిదా వేయించడానికి 2017 సెప్టెంబరు 8న 16 ఏళ్ల బాలుడు ఏడేళ్ల బాలికను పాఠశాల మరుగుదొడ్డిలోనే గొంతుకోసి హత్య చేశాడు.
- ❖ బాలుడి వయస్సు దృష్ట్యా జీవితఖైదు లేదా మరణశిక్ష విధించకూడదని నిందితుడి తరఫు న్యాయవాది వాదించారు.
- ❖ బాలుడు చేసింది నీచమైన నేరమని, కొత్తచట్టం ప్రకారం వయోజనుడేనని, ఐపీసీ 302 ప్రకారం జీవితఖైదు విధించినా క్షమాభిక్ష ఇచ్చే అవకాశం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. బెయిల్ మంజూరుకు సైతం నిరాకరించింది.

## హక్కులు ఉల్లంఘించే చట్టాలను కోర్టులు కొట్టేయొచ్చు: సుప్రీం

ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా చట్టం ఉంటే దాన్ని కొట్టివేయడానికో, సవరించడానికో, కొత్త చట్టం తీసుకురావడానికో ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంతవరకు న్యాయస్థానాలు వేచి చూడలేవని సుప్రీంకోర్టు జులై 24న స్పష్టం చేసింది.

- ❖ వయోజనుల మధ్య పరస్పరాంగీకార స్వలింగ సంపర్కాన్ని నేరంగా ప్రకటించే భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 రాజ్యాంగ చెల్లుబాటుపై విచారణ నిర్వహిస్తున్న ధర్మాసనం ఈ విషయాన్ని పేర్కొంది.
- ❖ చట్టాన్ని చేసే, సవరించే పరిధి న్యాయస్థానానికి లేదని, అది శాసనవ్యవస్థ పరిధిలోనిదని ఒక న్యాయవాది చేసిన వాదనకు ధర్మాసనం స్పందిస్తూ రాజకీయ కారణాలతో ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోనప్పుడు చట్టాలను కొట్టేసే అధికారాన్ని కోర్టులకు ఇవ్వడమే ప్రాథమిక హక్కుల అధ్యాయం లక్ష్యంగా ఉందని పేర్కొంది.
- ❖ 'ఐపీసీలోని సెక్షన్ 377ను ఎత్తివేస్తే అరాచకం ఏర్పడుతుంది. పురుషుడు-పురుషుడు, స్త్రీ-పురుషుడి మధ్య పరస్పరాంగీకార లైంగిక చర్య విషయమే ఇక్కడ ముఖ్యం.
- ❖ సమ్మతి అనేది కీలకం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఒక వ్యక్తి తన లైంగిక స్వభావాన్ని ఇతరుల అంగీకారం లేకుండా వారిపై రుద్దలేరని చెప్పింది.
- ❖ స్వలింగ సంపర్కం వల్ల ఎయిడ్స్ లాంటి వ్యాధులొస్తున్నాయని

న్యాయవాదులు చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. వ్యభిచారానికి అధికారిక అనుమతి ఇస్తేనే సుఖరోగాలను నియంత్రించవచ్చని, పాతకాలం నాటి నియమాలతో నియంత్రించాలనుకుంటే ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందంది.

### 'నామినేటెడ్ ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు

పుదుచ్చేరి నామినేటెడ్ ఎమ్మెల్యేల కేసులో మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. శాసనసభ కార్యక్రమాల్లో నామినేటెడ్ ఎమ్మెల్యేలూ పాల్గొనవచ్చంటూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

❖ ప్రస్తుత శాసనసభకు రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులు లేకుండానే భాజపా పుదుచ్చేరి నిర్వాహకులు శంకర్, సెల్వగణపతి, స్వామినాథన్‌లను కేంద్రప్రభుత్వం నియమించగా వారితో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ పదవీప్రమాణం చేయించారు.

❖ ప్రభుత్వ సిఫారసులు లేకుండా కేంద్రం చేసిన నియామకాలు చెల్లవని, వారిని శాసనసభలోకి అనుమతించలేమని అప్పట్లో సభాపతి వైద్యలింగం ప్రకటించారు. దీనిపై మద్రాసు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు కాగా... నామినేటెడ్ సభ్యుల నియామకం చెల్లుతుందని మార్చి 23న తీర్పు వెలువడింది.

### కావేరీ వివాద ట్రైబ్యునల్ రద్దు

కావేరీ జల వివాదాల ట్రైబ్యునల్ (సీడబ్ల్యూడీటీ)ని కేంద్రం రద్దు చేసింది. నదీ జలాల పంపకం విషయంలో తలెత్తిన వివాదాలన్నీ కొలిక్కి వచ్చినందువల్ల ఇక ఇది అవసరం లేదని సీడబ్ల్యూడీటీ నివేదించిన మీదట కేంద్రం సంతృప్తిచెంది ఈ నిర్ణయం తీసుకొంది.

❖ 1990 జూన్ 2న బోర్డు ఏర్పాటయింది.

# పర్యావరణం

### తాజ్‌మహల్ ప్రాంతం ప్లాస్టిక్‌రహితంగా మారాలి

ప్రఖ్యాత తాజ్‌మహల్ కట్టడం చుట్టూ ఉన్న ప్రాంతంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. స్థానికంగా కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలనూ మూసివేయాలని సూచించింది.

❖ తాజ్‌మహల్ పరిరక్షణ అంశంపై సుప్రీం కోర్టుకు సమర్పించిన దార్శనిక పత్రం ముసాయిదాలో ఈ విషయాలను పేర్కొంది.

❖ తాజ్‌పై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందంటూ.. ఇటీవల సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ అంశంపై ఒక ముసాయిదా దార్శనిక పత్రాన్ని దాఖలు చేసేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనికి ధర్మాసనం సమ్మతించింది.

❖ ఆ మేరకు తాజాగా దార్శనిక పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది.

**అందులోని వివరాల ప్రకారం..**

❖ తాజ్‌ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించడంతోపాటు వాటర్ బాటిళ్ల వినియోగాన్నీ నిషేధించాలి.

❖ ఈ ప్రాంతంలో కాలుష్యకారక పరిశ్రమలను మూసేయడంతోపాటు పర్యాటక హబ్‌లను ఏర్పాటు చేయాలి.

❖ తాజ్ ప్రాంగణం పరిసరాల్లో పాదచారుల మార్గాలను ప్రోత్సహించేందుకు సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళిక అవసరం. యమునా నదీముఖం వెంబడి రోడ్లపై వాహన రద్దీ తక్కువగా ఉండేలా చూడాలి.

❖ యమున వరద మైదానం వెంబడి ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదు. నది ఒడ్డున చెట్లు నాటాలి.

**శబరిమలలో ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం**

❖ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన శబరిమలలో ప్లాస్టిక్‌పై పూర్తిగా నిషేధిస్తూ కేరళ హైకోర్టు సోమవారం ఆదేశాలిచ్చింది. ఈ ఆధ్యాత్మిక ప్రాంతాన్ని పర్యావరణ హితంగా ఉంచేందుకు గాను.. నీళ్లు సహా దేన్నీ ప్లాస్టిక్ సీసాలు, ప్యాకెట్లలో విక్రయించడాన్ని రెండేళ్ల క్రితమే హైకోర్టు నిషేధించింది.

❖ కాగా భక్తులు తమ ఇరుముడికట్టులో – ఆలయ ప్రధాన అర్చకులు నిర్దేశించిన, త్వరగా మట్టిలో కలిసిపోయే (బయో డీగ్రేడబుల్) ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలంటూ జస్టిస్ పీఆర్ రామచంద్ర మేనన్, జస్టిస్ దేవన్ రామచంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తాజాగా ఆదేశించింది. ఈమేరకు శబరిమల ప్రత్యేక కమిషనర్ రూపొందించిన నివేదికను హైకోర్టు పరిగణలోకి తీసుకుంది. వచ్చే దర్శనకాలం(సీజన్) నుంచీ అయ్యప్పస్వామి క్షేత్రంతో పాటు, పరిసర ప్రాంతాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వినియోగించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది. విచక్షణ రహితంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కారణంగా తీవ్ర పర్యావరణ ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో హైకోర్టు తాజాగా ఆదేశాలిచ్చింది.

**ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్లాస్టిక్‌పై నిషేధం**

❖ తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జులై 15 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని వెల్లడించింది.

❖ పాలిథిన్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, నీళ్ల బాటిళ్ల కారణంగా పర్యావరణం విపరీతంగా కలుషితమవుతున్న సంగతి తెలిసిందే.

❖ జూన్ 23న మహారాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తెచ్చింది. కాగా, చిన్న వ్యాపారులకు, రిటైలర్లకు ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వినియోగం విషయంలో మినహాయింపు ఇచ్చింది.

❖ కిరాణా షాపులు, ఇతర సాధారణ దుకాణాలలో ధాన్యాలు, తదితర వస్తువులు ప్యాక్ చేయడానికి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించుకోవచ్చని తెలిపింది. అయితే కవర్ మందం 50 మైక్రాన్స్ కంటే ఎక్కువ ఉండాలని ఆదేశించింది.

❖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తోంది.

**మహారాష్ట్రలో ప్లాస్టిక్‌పై నిషేధం**

❖ మహారాష్ట్రలో ప్లాస్టిక్‌పై నిషేధం విధించారు. ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువుల తయారీ, ఉపయోగం, అమ్మకం, నిల్వ, సరఫరాపై నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 23న వెల్లడించింది.

❖ ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, స్పూన్లు, కొన్ని రకాల బాటిళ్లు, థర్మాకోల్ వస్తువులు తదితర వాటిపై ఈ నిషేధం విధించింది. అప్పటికే ఉన్న స్టాక్‌ను డిస్పోజ్ చేయడం కోసం తయారీదారులకు మూడు నెలల సమయం ఇచ్చింది.

❖ జరిమానాల విషయంలో .. మొదటి సారి పట్టుబడితే రూ.5వేల రూపాయలు, రెండోసారి పట్టుబడితే రూ.10వేల జరిమానా

విధిస్తామని తెలిపారు. మూడో సారి కూడా పట్టుబడితే రూ.25వేల జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధిస్తామని స్పష్టంచేశారు.

- నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు దాదాపుగా 80శాతం గుజరాత్‌లో తయారై మహారాష్ట్రకు దిగుమతి అవుతున్నాయని కదమ్ ఆరోపించారు.
- నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను మహారాష్ట్రలోకి తీసుకొస్తే మూడు నెలలు జైలు శిక్ష వేస్తామన్నారు. మహారాష్ట్రలో ప్రతి రోజూ 1200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని కదమ్ తెలిపారు. ప్రజల్లో నిషేధం గురించి చాలా అవగాహన కల్పించామని, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దిల్లీ కాలుష్యానికి ఒక్క ఏడాదిలో 15వేల మంది బలి

రాజధాని దిల్లీ నగరంలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య పూరిత నగరాల్లో దిల్లీ ముందు వరుసలో ఉన్న సంగతి తెలిసిందే.

- కేవలం 2016 ఒక్క ఏడాదిలోనే దిల్లీలో దాదాపు 15వేల మంది కాలుష్యం కారణంగా మరణించారని ఓ సర్వే వెల్లడించింది.
- గాలిలోని సన్నని ధూళికణాల (ఫైన్ పర్టిక్యులేట్ మ్యాటర్) కారణంగా జీవనకాలం కంటే ముందుగానే 14,800 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సర్వే తెలిపింది.
- ప్రపంచవ్యాప్తంగా విష పూరితమైన గాలి కారణంగా అత్యధిక మరణాలు సంభవించిన నగరాల జాబితాలో దిల్లీ మూడో స్థానంలో ఉంది.
- ఈ జాబితాలో చైనాలోని షాంఘై తొలి స్థానంలో ఉంది.అక్కడ 2016లో 17,600 మంది జీవనకాల పరిమితికి ముందుగానే చనిపోయారు. 18,200 మరణాలతో బీజింగ్ రెండో స్థానంలో ఉంది.
- గాలిలోని పర్టిక్యులేట్ మ్యాటర్ 2.5 కారణంగా ఈ మరణాలు సంభవించినట్లు సర్వే తెలిపింది. ప్రస్తుతం గాలి కాలుష్యం ప్రధాన ముప్పుగా మారిందని, దీన్ని అధిగమించేందుకు పటిష్ఠమైన ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అవసరమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ అనుమిత రాయ్‌చౌదరి వెల్లడించారు.
- దిల్లీలో వాయు కాలుష్యంపై పోరాడేందుకు భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ నేషనల్ ప్రీమియర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోందని అన్నారు.
- గాలిలో పీఎం2.5 కాలుష్యం వల్ల గుండె, ఊపిరితిత్తుల సంబంధిత జబ్బులతో పాటు క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయి.
- రకరకాల జబ్బులతో జీవనకాలం తగ్గిపోయి ముందుగానే మరణం సంభవిస్తాయి. 2016లో దిల్లీలో 14,800మంది, ముంబయిలో 10,500, కోల్‌కతాలో 7,300, బెంగళూరులో 4,800, చెన్నైలో 4,800 మంది వాయు కాలుష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయారు.

# సామాజికాంశాలు

## ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ఫిర్యాదుల సంఖ్య రెట్టింపు

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు సంబంధించిన ఫిర్యాదుల సంఖ్య గత మూడేళ్ల కాలంలో రెట్టింపైంది.

- మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ గణాంకాలు ఈ విషయాన్ని సుస్పష్టం చేస్తున్నాయి. కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ రాజ్యసభలో ఓ లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ గణాంకాలను వెల్లడించారు.

## ఒక నెల ఉద్యోగం లేకపోయినా... భవిష్యనిధి నుంచి 75% వెనక్కి తీసుకోవచ్చు

ఒక నెలపాటు ఉద్యోగం లేక నిరుద్యోగిగా మారే భవిష్యనిధి చందాదారులు... తమ ఖాతా నుంచి 75% సొమ్మును వెనక్కు తీసుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు.

- ఇటీవల జరిగిన ఉద్యోగుల పింఛను నిధి (ఈపీఎఫ్) ధర్మకర్తల మండలి ఈ మేరకు ప్రతిపాదించినట్లు ఆయన లోక్‌సభలో తెలిపారు.
- ఈ మేరకు ఈపీఎఫ్ పథకం-1952లోని 68హెచ్‌హెచ్ పేరాలో మార్పులు చేయాలని మండలి సూచించిందని ఆయన వివరించారు.
- ఉద్యోగాన్ని విడిచిపెట్టిన చందాదారులు... తమ భవిష్యనిధి సొమ్మును పూర్తిగా వెనక్కు పొందేందుకు 2 నెలలు నిరీక్షించాల్సి ఉంటుందనీ... వివాహం నిమిత్తం ఉద్యోగం మానేసిన మహిళలకు మాత్రం ఈ నిబంధన వర్తించదని మంత్రి స్పష్టం చేశారు.

## యూజీసీని రెండుగా విభజిస్తున్నాం

విశ్వవిద్యాలయాల నిధుల సంఘాన్ని (యూజీసీ) పూర్తిగా తీసివేయడం లేదని.. రెండుగా విభజిస్తున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ స్పష్టం చేశారు.

- ఒకటి నియంత్రణ వ్యవస్థలా పనిచేస్తే.. రెండోది నిధుల (గ్రాంట్లు) విడుదల చూస్తుందని వివరించారు.

## గ్రంథ చౌర్యం నిరోధానికి టర్నిటిన్ సాఫ్ట్‌వేర్

పీహెచ్‌డీ చేసే పరిశోధక విద్యార్థులు ఇతర పరిశోధనలను కాపీ కొట్టి తమ సిద్ధాంత వ్యాసాలను రాయకుండా నిరోధించేందుకు ‘టర్నిటిన్ సాఫ్ట్‌వేర్’ను ఉపయోగించనున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు.

- కాపీలు కొట్టి పరిశోధన వ్యాసాలు రాయడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. గ్రంథ చౌర్యం చేసి వ్యాసాలు రాసేవారికి పీహెచ్‌డీలు ప్రదానం చేయబోమని అన్నారు.

## అత్యాచారాలకు పాల్పడేవారికి ప్రభుత్వ పథకాలు బంద్‌నిర్ణయించిన హరియాణ ప్రభుత్వం

అత్యాచార కేసులు పెరిగిపోతుండటంతో హరియాణ ప్రభుత్వం వీటిని నియంత్రించడానికి నడుం బిగించింది.

- అత్యాచారానికి పాల్పడే వారిపై, ఈ కేసుల్లో దోషులుగా తేలిన వారిపై ఉక్కుపాదం మోపనుంది. ఇకపై వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలను నిలిపివేయనుంది.
- మహిళా భద్రత కోసం హరియాణ ప్రభుత్వం ఒక యాప్‌ను ప్రవేశపెట్టింది..